సాక్షి
అనంతపురం
శనివారం । 10 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 935 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



మేలైన దిగుబడులు సాధించండి

మేలైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. కణేకల్లులో నిర్వహించిన రైతు శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం 40.5°/22.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు



ఓటీపీఆర్‌ఐ బ్లాక్‌ను ప్రారంభించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డి

అనంతపురం: విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆధునీకరించిన సైన్స్ బ్లాక్ (మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్స్, ల్యాబ్, తరగతి గదులు, సెమినార్ హాలు), ఓటీపీఆర్‌ఐలోని సైన్స్ బ్లాక్‌లో మూడో అంతస్తును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యలో సమూలమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్ధన నూతనంగా నిర్మించిన తరగతి గదులు 7, ఒక స్టాఫ్‌రూమ్‌ను ప్రారంభించారు. ఓటీపీఆర్‌ఐ కళాశాలలో విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా తరగతి గదులను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్, ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.శశిధర్, యూనివర్సిటీ ఇంజినీర్ జహీర్ అస్లాం, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ, ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.గోపీనాథ్ పాల్గొన్నారు.

డీటీసీ బాధ్యతల స్వీకరణ



ఉప రవాణా కమిషనర్ వీర్రాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్టీఓ సురేష్‌నాయుడు

అనంతపురం సెంట్రల్: ఉప రవాణా కమిషనర్(డీటీసీ)గా వీర్రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి ఆర్టీఓగా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై అనంతపురం డీటీసీగా నియమితులయ్యారు. నూతన డీటీసీకి ఆర్టీఓ సురేష్‌నాయుడు, పలువురు ఎంవీఐలు, ఏఎంవీఐలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

గ్లెన్‌బ్రిగ్స్‌కు మూడేళ్ల జైలు

అనంతపురం: గుంతకల్లు కేంద్రంగా సాగే నకిలీ విద్యా సర్టిఫికెట్ల తయారీ కేసులో ప్రధాన ముద్దాయి గ్లెన్‌బ్రిగ్స్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఓంకార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చేయకపోయినా చేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించడంలో గ్లెన్‌బ్రిగ్స్ సిద్ధహస్తుడు. 1997 సంవత్సరం నుంచే కుప్పలు తెప్పలుగా సర్టిఫికెట్లు సృష్టించి సొమ్ము చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై మొత్తం 39 మందిపై 2015లో గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారని సీఐడీ విచారణ చేసి ధ్రువీకరించింది. సీఐడీ నివేదిక ఆధారంగా మేజిస్ట్రేట్ ఓంకార్ శుక్రవారం తన తీర్పు వెలువరించారు. ప్రధాన ముద్దాయి గ్లెన్‌బ్రిగ్స్‌తో పాటు మరో ఇద్దరికి మూడేళ్ల కారాగార శిక్ష, రూ.30వేల చొప్పున జరిమానా విధించారు. మరో 31 మందికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధించారు. మిగిలిన ఐదుగురు ముద్దాయిలు వివిధ కారణాలతో ఇదివరకే చనిపోయారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

బీమా పథకం నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకుంది. కంపెనీలు ప్రీమియం మొత్తాలను పెంచేశాయి. అయితే పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బీమా అమలు విషయంలో వెనక్కు తగ్గలేదు. సొంతంగా వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది.

- 'కుటుంబ పెద్ద' సహజ మరణమైతే రూ.లక్ష పరిహారం
- ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యం చెందినా రూ.5 లక్షలు
- సచివాలయాల ద్వారా పథకం అమలు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు వర్తింపు
- కేంద్రం తప్పుకున్నా అమలులో వెనక్కి తగ్గని రాష్ట్ర ప్రభుత్వం



వైఎస్సార్ బీమా సొమ్ముతో కొనుగోలు చేసిన ఎద్దులను చూపుతున్న ఎం. కొల్లక్క

అనంతపురం: పేదలకు సంక్షేమాన్ని అందించే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గడం లేదు. వైఎస్సార్ బీమా విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో బీమా పథకం అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తన వంతుగా 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఇచ్చేది. అయితే, 2020 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం పథకం నుంచి తప్పుకుంది. ఇదే సమయంలో బీమా కంపెనీలు ప్రీమియం 35 శాతం పెంచాయి. కేంద్రం తప్పుకోవడంతో ఈ పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం తన భుజాల మీద వేసుకుంది.

మూడేళ్లలో రూ.73.14 కోట్లు..

జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో 4,379 క్లైయిమ్‌లకు రూ.73.14 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయిన ఆయా కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించింది.

బీమా వర్తింపు ఇలా...

కుటుంబ పెద్ద సహజ మరణం పొందినా లేదంటే ప్రమాదవశాత్తు మరణించినా పరిహారం పొందేలా వైఎస్సార్ బీమా పథకాన్ని తీర్చిదిద్దారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వ్యక్తి సహజంగా మరణిస్తే.. అపుడు వారి కుటుంబానికి రూ.లక్ష చెల్లిస్తారు. 18 నుంచి 70 ఏళ్ల వయసులో ఉన్నవారు ప్రమాదంలో మరణించినా లేదంటే వైకల్యం సంభవించినా రూ.5 లక్షల వరకు లభిస్తాయి. బీమా మొత్తం బ్యాంకు అకౌంట్లలో నేరుగా జమ అవుతుంది. బీమా క్లైయిమ్ చేసిన 15 రోజుల్లోగా డబ్బులు వస్తాయి. లబ్ధిదారుడి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తారు. పేదలు, అసంఘటిత కార్మిక కుటుంబాలపై భారం పడకుండా ఉండేందుకు ఏపీ ప్రభుత్వం బీమా ప్రీమియం ఖర్చును భరిస్తోంది. వైఎస్సార్ బీమా పథకంలో చేరిన వారికి ఒక గుర్తింపు కార్డు లభిస్తుంది. ఇందులో ప్రత్యేక గుర్తింపు సంఖ్య, పాలసీ నంబర్ ఉంటాయి. ఈ పథకానికి సంబంధించి లేబర్ డిపార్ట్‌మెంట్ నోడల్ ఏజెన్సీగా, సచివాలయ శాఖ అమలుపరిచే ఏజెన్సీగా ఉంటున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ బీమా పథకం మొత్తం 1.22 కోట్ల మందికి రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేశారు. ప్రస్తుతం ఈ పథకానికి సంబంధించి సర్వే కొనసాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 12,20,762 మంది అర్హులు కాగా, 9,18,686 మందికి సర్వే పూర్తయ్యింది.

బీమా నమోదులో 'అనంత'కు మూడో స్థానం

వైఎస్సార్ బీమా నమోదు ప్రక్రియలో అనంతపురం జిల్లాకు మూడో స్థానం దక్కింది. మొత్తం 6,02,538 మంది అర్హులు కాగా, 5,41,750 మందికి బీమా రెన్యూవల్ చేశారు. బీమా నమోదుకు శనివారం తుది గడువుగా నిర్దేశించినప్పటికీ, అర్హులై ఉండి , బీమా నమోదు చేయించుకోనట్లయితే మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయడానికి వెసులుబాటు కల్పించారు.

అర్హులు ఎవరంటే..

వైఎస్సార్ బీమా నమోదుకు 18 సంవత్సరాల వయసు నిండిన వారై ఉండాలి. 70 సంవత్సరాల లోపు వయసుండాలి. బీపీఎల్ కుటుంబానికి చెంది, రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబంలో ప్రాథమికంగా సంపాదించే వ్యక్తి అయి ఉండాలి.

బీమా పరిహారం అందింది

మా ఆయన వన్నూరప్ప 2021 ఆగస్టు 10న తీవ్రమైన జ్వరం రావడంతో మృతి చెందారు. మాకు ఒక కూతురు, ముగ్గురు కొడుకులు ఉన్నారు. వైఎస్సార్ బీమా పరిహారం కింద రూ.లక్ష అందింది. వ్యవసాయానికి అవసరమైన రెండు ఎద్దులను కొనుగోలు చేశాం.

– ఎం. కొల్లక్క, మల్లాపురం, రాయదుర్గం మండలం

రూ.5 లక్షల బీమా పరిహారం వచ్చింది



మా ఆయన బూసిగాని బయన్న గతేడాది సెప్టెంబర్ 8వ తేదీన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందారు. వ్యవసాయాధారిత కుటుంబం మాది. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలు ఇచ్చింది. ఇద్దరి పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం. నా కుమారుడు సాయికృష్ణ 8 సంవత్సరాలు, నా కుమార్తె దీక్షిత 5 సంవత్సరాల వయస్సు ఉంది.

– బూసిగాని భారతి, కర్ణపుడికి గ్రామం, నార్పల మండలం

కుటుంబ పెద్ద పేరున పాలసీ



కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండే వ్యక్తి పేరున బీమా పాలసీ తీసుకోవాలి. ఆ వ్యక్తికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ద్వారా అందే సొమ్ము కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. వలంటీర్లు కూడా కుటుంబ పోషకుడి పేరునే పాలసీ ఇవ్వాలి.

– ఐ. నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

రూ.4.32 కోట్ల నీటి సరఫరా బిల్లుల విడుదల

అనంతపురం అర్బన్: నీటి సరఫరా పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా 2018–19, 2019–20, 2020–21 ఆర్థిక సంవత్సరంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ ప్రక్రియంతా జియో ట్యాగ్ చేశారు. మొత్తం 292 పనులకు సంబంధించి బిల్లులను గ్రామీణ నీటి సరఫరా అధికారులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ మేరకు నీటిసరఫరాకు సంబంధించిన రూ.4.32 కోట్ల బిల్లులను ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం అర్బన్: జలజీవన్ మిషన్, గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న హౌసింగ్ కాలనీల్లో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అంశాలపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సత్యసాయి నీటి సరఫరా బోర్డు అంశాలపైనా చర్చించారు. గ్రామపంచాయతీలు, నగర పంచాయతీలు, మునిసిపాలిటీల్లో నీటి సరఫరా చార్జీల బకాయిల వసూలు వందశాతం ఉండేలా చూడాలని చెప్పారు. జలజీవన్ మిషన్ కింద మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సత్యసాయి నీటి సరఫరా ప్రాజెక్టు బోర్డు 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి వార్షిక జమ, ఖర్చులు, పలు పనులకు ఆమోదం తీసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇషాన్ బాషా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సంబరాలు



ఉరవకొండలో సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాప్తాడు రూరల్: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలు సంబరాలు చేసుకున్నాయి. జిల్లాలో వరుసగా రెండోరోజు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సీఎం ఫొటోకు క్షీరాభిషేకం చేసి, సీఎం సార్...మీ మేలును ఎప్పటికీ మరువలేమని సంతోషం వ్యక్తం చేశారు.

- గుంతకల్లులో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ నాయకులు కే.శ్రీనివాసులు, కుమార్‌స్వామి, షేక్షావలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వె.వెంకటరామిరెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు జీవితాంతం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.
- బుక్కరాయసముద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ఎంపీపీ సునీత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆలూరు రమణారెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి, సంబరాలు జరుపుకొన్నారు.
- బొమ్మనహాళ్ మండల కేంద్రంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు..

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, కోశాధికారి సాలెం రాజు, మహిళా కార్యదర్శి మైథిలి, సత్యనారాయణమ్మ, మురళీమోహన్, జనార్దన్‌రెడ్డి, నరసింహప్ప, జెకే రాము తదితరులు ఓ ప్రకటన విడుదల చేశారు. 2014 జూన్ రెండో తేదీ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం తమ జీవితాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు.

గౌరవప్రదంగా జీవించాలి

- ప్రత్యమ్నాయ ఉపాధికి సహకారం
- 'అనంత'ను సారారహిత జిల్లాగా మారుద్దాం
- సారాతయారీదారులకు కలెక్టర్ గౌతమి పిలుపు

అనంతపురం అర్బన్: సారా తయారీకి స్వస్తి చెప్పి గౌరవప్రదమైన జీవనం సాగించాలని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో అనంతపురాన్ని సారారహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సారాతయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు సంబంధించి రుణాలు మంజూరు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు సారా తయారీని వృత్తిగా చేసుకుని సాగిస్తున్న జీవితంలో ఎన్నో అవమానాలు, ఇబ్బందులు పడి ఉంటారన్నారు. అలాంటి జీవితాన్ని మీ పిల్లలకు ఇవ్వకూడదన్నారు. సారా తయారీకి స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవనం కొనసాగించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం తరపున జిల్లా యంత్రాగం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. 12 మండలాల పరిధిలో సారా తయారీకి స్వస్తి చెప్పిన 121 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి కోసం బ్యాంక్‌లు, స్త్రీనిధి, ఉన్నతి పథకం, వీఓ ఫండ్స్ ద్వారా రూ.1,01,64,000 రుణం మంజూరు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించి సమాజంలో గౌరవంగా జీవించాలన్నారు. రుణా మొత్తానికి సంబంధించి మెగాచెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు, సెబ్ ఏఎస్పీ జి.రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి, ఎల్‌డీఎం సత్యరాజ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కు విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

వర్ష సూచన

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్షం కురిసే సూచనలు ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 35.8 – 38, రాత్రి ఉష్ణోగ్రతలు 25.0–26.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు.

శింగనమల నియోజకవర్గాన్ని కోనసీమగా మారుస్తాం

- 45 చెరువులకు హంద్రీనీవా ద్వారా 1.35 టీఎంసీల నీటి కేటాయింపు
- ఇప్పటికే శింగనమల చెరువు లోకలైజేషన్, పుట్లూరు మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్
- ఈ పథకాలతో సాగు, తాగునీటి కష్టాలు తీరతాయి
- సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం
- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



నీటి కేటాయింపు పత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గాన్ని కోనసీమగా మారుస్తామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సాగునీటి వనరులను వినియోగించుకుని పచ్చని పంట పొలాలతో అలరారేలా చూస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా చెరువులు, కుంటలు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. తాను ఎన్నికల సమయంలో సాగునీరు ఇచ్చాకే గ్రామాల్లోకి అడుగుపెడతామని హామీ ఇచ్చానని, ఆ మేరకు నియోజకవర్గంలో అన్ని చెరువులు, కుంటలను నీటితో నింపిన తరువాతే ప్రజల ముందుకు వస్తున్నానని చెప్పారు. ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా.. శింగనమల చెరువు లోకలైజేషన్ చేయించిన ఘనత మాత్రం తమకే దక్కిందన్నారు. ఒక టీఎంసీ నీటి కేటాయింపుతో శింగనమల చెరువును ఇప్పటికే లోకలైజేషన్ చేశారని గుర్తు చేశారు. అలాగే గండికోట నుంచి పుట్లూరు మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మంజూరు చేయించామన్నారు. అర టీఎంసీ నీటి కేటాయింపుతో రూ.252 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల సాగు, తాగునీటి కష్టాలు తీరతాయని తెలిపారు. నియోజకవర్గంలోని దాదాపు 50 చెరువులు, నీటి కుంటలకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, హెచ్చెల్సీ ద్వారా నీటిని కేటాయించాలని తాను, ఆలూరు సాంబశివారెడ్డి ముఖ్యమంత్రిని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన జగనన్న ఒక చెల్లికి కానుకగా హంద్రీ–నీవా ద్వారా 45 చెరువులకు 1.35 టీఎంసీల నీటిని కేటాయిస్తూ జీఓ విడుదల చేశారని తెలిపారు. తమతో పాటు నియోజకవర్గ ప్రజలంతా జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. గతంలో ప్రజలకు తాగేందుకు కూడా నీరు సరిగా ఉండేది కాదన్నారు. రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుని పంటలు కాపాడుకునేవారన్నారు. ఇక్కడి దుర్భర పరిస్థితులు వివరించగానే సీఎం సానుకూలంగా స్పందించి నీటి కేటాయింపునకు నిర్ణయం తీసుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ సునీత, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ, మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధర్మవరం కుడికాలువకు నీటి విడుదల



ధర్మవరం కుడికాలువ గుండా ప్రవహిస్తున్న నీరు

కూడేరు: ధర్మవరం కుడికాలువకు ఇరువైపులా భూములున్న రైతుల విజ్ఞప్తి మేరకు కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ జలాశయం నుంచి కుడి కాలువకు అధికారులు నీటిని విడుదల చేశారు. 154 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు డ్యాం జేఈ లక్ష్మీదేవి తెలిపారు. డ్యాంలో నీటి మట్టం 3.14 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలం కావడంతో నీటి సమస్యతో పంటలు దెబ్బతింటాయని, కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు కోరినట్లు చెప్పారు.

ఆర్టీసీ కార్గోలో గుట్కా సరఫరా

- విజిలెన్స్ అధికారులకు పట్టుబడిన గుట్కా ప్యాకెట్లు



తనిఖీ నిమిత్తం వచ్చిన పోలీసులు, అధికారులు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ కార్గోలో నిషేధిత గుట్కా (ఖైనీ)ను అక్రమంగా తరలిస్తున్నారు. శుక్రవారం ఏలూరు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులో బస్తాలను కార్గో కార్యాలయంలో దించారు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు అనుమానం వచ్చి పరిశీలించారు. సుమారు 400 కేజీల గుట్కాను అనుమానం రాకుండా గోనె సంచుల్లో ప్యాక్ చేశారు. ఏలూరు నుంచి శేషు అనే వ్యక్తి అనంతపురం నగరానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 80 వేలకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. వెంటనే ఆర్టీసీ డీఎం నాగభూపాల్, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, కార్గో , విజిలెన్స్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు గుట్కా సంచులను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అనాథలపై వాత్సల్యం

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి 29,775 మంది ఎంపిక
- ఒక్కొక్కరికి రూ.4 వేల ఆర్థిక భరోసా
- త్వరలోనే ఖాతాల్లోకి డబ్బు జమవుతుందంటున్న అధికారులు



రాయదుర్గం: ఎవరూ లేని అభాగ్యులు.. అనాథలు.. నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయి. అనాథ బాల, బాలికలు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించేలా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా...

అర్హత కలిగిన వారందరికీ ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం రూ.1400, కేంద్ర ప్రభుత్వం రూ.2,600 కలిపి మొత్తం రూ.4 వేలు అందించేలా రూపకల్పన చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బంది ఇటీవల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలోని 2,302 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 2023–24వ ఆర్థిక సంవత్సరానికి 29,775 మంది వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకం ఏప్రిల్ 2022 నుంచి అమల్లోకి రావడంతో 2022–23వ ఆర్థిక సంవత్సరానికి కేవలం 637 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వారికి 8 నెలలకు గాను రూ.1,76,60,000 మొత్తాన్ని అభాగ్యుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేశారు.

29,775 మంది ఎంపిక..

ఈ ఏడాది క్షేత్రస్థాయిలో మిషన్ వాత్సల్య పథకంపై ఐసీడీఎస్ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించడంతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అర్హత ఉన్న 29,775 మందిని అధికారులు ఎంపిక చేశారు. అందులో బాలురు 15,560, బాలికలు 14,215 మంది ఉన్నారు. నిధులు కూడా త్వరలో జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

త్వరలోనే అర్హులకు లబ్ధి

జిల్లాలో మిషన్ వాత్సల్య పథకంపై విస్తతంగా అవగాహన కల్పించాం. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అర్హత కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాం. చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా అన్ని విధాల పరిశీలించాకే దరఖాస్తులు తీసుకున్నాం. ఈ పథకం ద్వారా అభాగ్యులు, అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న పేద పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి నెల రూ.4 వేలు వారి ఖతాలకే జమ చేస్తాయి. గతేడాది 637 మంది లబ్ధి పొందితే ఈ ఏడాది ఊహించని విధంగా 29,775 మంది అర్హత సాధించారు. వీరందరికీ త్వరలో పథకం వర్తించనుంది.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం



ఈ పథకం కోసం ఎలాంటి వారు దరఖాస్తు చేశారంటే..

- తల్లిదండ్రులను కోల్పోయి ఇతరులు, బంధువుల చెంత ఆశ్రయం పొందుతున్న చిన్నారులు
- కొవిడ్ తో తల్లిదండ్రులను కోల్పోయిన వారు
- హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, హింస, దోపిడీకి గురవుతున్న పిల్లలు
- పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకంలో లబ్ధి పొందుతున్న చిన్నారులు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న దంపతుల పిల్లలు
- తల్లిదండ్రులు ఆర్థికంగా వెనుకబడి, శారీరకంగా సమర్థత కోల్పోయిన వారి బిడ్డలు
- న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం–2015 ప్రకారం గుర్తించిన బాల బాలికలు
- ఇంటి నుంచి పారిపోయి యాచకులుగా మారిన చిన్నారులు
- పునరావాసం కోసం ఎదురుచూసే బాలికలు
- తల్లి వింతంతువై లేదా విడాకులు తీసుకుని కుటుంబాన్ని విడిచిపెట్టి ఉంటున్న వారి పిల్లలు

బైక్ అదుపు తప్పి నలుగురికి గాయాలు

కళ్యాణదుర్గం: గొర్రెలు అడ్డురావడంతో బైకు బోల్తా పడి నలుగురు గాయపడిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని హులికల్లు గ్రామం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాలమేరకు... కణేకల్ మండలం గోపలాపురంకు చెందిన రామ్మూర్తి తన ఇద్దరు కుమార్తెలు రాజేశ్వరి, ప్రియ, కుమారుడు మనోజ్‌లతో కలిసి కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో తమ బంధువును చూసేందుకు వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. హులికల్లు వద్ద రోడ్డుకు గొర్రెలు అడ్డురావడంతో వాహనం అదుపు తప్పింది. రామ్మూర్తితో పాటు పిల్లలకూ గాయాలయ్యాయి. రాజేశ్వరికి బలమైన గాయాలు కావడంతో అనంతపురం తరలించారు.

డీసీసీబీ ద్వారా విరివిగా రుణాలు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే మిగతా వర్గాల అభ్యున్నతికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా విస్తృతంగా సేవలు అందించాలని బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆదేశించారు. శుక్రవారం డీసీసీబీ హాలులో బ్యాంకు మేనేజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. పక్కా ప్రణాళికతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు. రైతులు, మహిళలు, ప్రభుత్వ పథకాల కింద విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు రూ.650 కోట్లు మేర డిపాజిట్లు సేకరించాలన్నారు. రైతులకు పంట రుణాలు, బంగారు నగల తాకట్టుపై రుణాలకు రూ.150 కోట్లు, ఎస్‌హెచ్‌జీలకు రూ.120 కోట్లు, జేఎల్‌జీ గ్రూపులకు రూ.50 కోట్లు, దీర్ఘకాలిక (ఎల్‌టీ) రుణాలు రూ.100 కోట్ల పంపిణీ లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఇక నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) బాగా తగ్గించే క్రమంలో మొండిబకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, ఓఎస్‌డీ దినేష్‌కుమార్, డీజీఎం డి.సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత

అనుమానాస్పదస్థితిలో రైతు మృతి



శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

యాడికి: ఓ రైతు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని చందన గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. చందన గ్రామానికి చెందిన వలిపిరెడ్డి శివారెడ్డికి శ్రీనివాసులరెడ్డి (57), శ్రీకాంత్‌రెడ్డి ఇద్దరు కుమారులు. గ్రామ సమీపంలో ఉన్న 6 ఎకరాలను శివారెడ్డి ... శ్రీనివాసరెడ్డి కుమారుడైన రాజశేఖర్‌రెడ్డిపై రిజిస్టర్ చేయించారు. అయితే ఆస్తిలో వాటా ఇవ్వలేదన్న ఆగ్రహంతో శ్రీకాంత్‌రెడ్డి భార్య సులోచనమ్మ, ఇద్దరు కుమారులు రవికుమార్ రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి కలసి శ్రీనివాసరెడ్డితో గొడవ పడుతుండటంతో ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయి. ఈ విషయంలో కోర్టుకు కూడా వెళ్లారు. గురువారం సాయంత్రం పొలంలో సేద్యం చేశారని తెలుసుకున్న సులోచనమ్మ తన ఇద్దరు కుమారులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీనివాసరెడ్డి భార్యతో వాదనకు దిగారు. మరో వైపు శ్రీనివాసరెడ్డి పచ్చారుమేకల పల్లె రహదారిలో తన బంధువుల అరటి తోటలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 108 వాహనంలో యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే శ్రీనివాసులురెడ్డి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతుడు బయన్న

తాడిపత్రి: మండల పరిధిలోని యర్రగుంటపల్లి వద్ద తాడిపత్రి – అనంతపురం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముచ్చుకోట గ్రామానికి చెందిన బయన్న (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల మేరకు... ముచ్చుకోట నుంచి పని నిమిత్తం తాడిపత్రికి శ్రీనివాసులుకు చెందిన ఆటోలో బయన్న బయలుదేరారు. మార్గమధ్యంలో పద్మజ అనే యువతి ఆటోలో ఎక్కింది. యర్రగుంటపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ముందు వైపు విద్యుత్ స్తంభాలతో వెళుతున్న ట్రాక్టర్ ఉన్నట్టుండి రహదారిపై వెనుక వస్తున్న ఆటోను చూసుకోకుండా ట్రాక్టర్ డ్రైవర్ మణికంఠ కుడివైపునకు ట్రాక్టర్‌ను తిప్పే ప్రయత్నం చేశాడు. దీంతో వెనుకనే వస్తున్న ఆటో విద్యుత్‌స్తంభాలను బలంగా ఢీ కొంది. దీంతో ఆటో అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో బయన్న అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, పద్మజలకు గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు బయన్నకు భార్య నాగలక్షుమ్మ ఉన్నారు.

పశుసంవర్ధకశాఖలో బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ పరిధిలో వివిధ హోదాల్లోని పలువురు అధికారులకు శుక్రవారం డైరెక్టరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హిందూపురం పాలీ వెటర్నరీ క్లినిక్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే.రఘునాథ్‌ను వింజమూరుకు బదిలీ చేశారు. డాక్టర్ల విభాగంలో వెటర్నరీ డిస్పెన్సరీ (వీడీ స్థాయి హాస్పిటల్)లో పనిచేస్తున్న డాక్టర్ పీఎస్ మృదులను హావలిగి నుంచి ఎర్రగుంట్ల వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ ఓ.మాధవిని రత్నగిరి వీడీ నుంచి పాలసముద్రం వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ ఎం.విజయలక్ష్మిని వెంకటాంపల్లి వీడీ నుంచి యాడికి వీడీకి, డాక్టర్ డీపీ ఉస్సేనీని చుక్కలూరు వీడీ నుంచి ఎస్.రాచర్ల వీడీకి, డాక్టర్ ఎం.సుబ్బారెడ్డిని యాడికి నుంచి వెంకటాంపల్లి వీడీకి బదిలీ చేశారు. డాక్టర్ వి.జయకుమార్‌రెడ్డిని రాయాపురం నుంచి చిలమత్తూరు వీడీకి, డాక్టర్ డి.మౌలాలీ బాషాను రామగిరి నుంచి నాగసముద్రం వీడీకి బదిలీ చేశారు. జూనియర్ వెటర్నరీ విభాగంలోవై.లక్ష్మీకాంతమ్మను యు.బసవనపల్లి గ్రామీణ పశువైద్యశాల (ఆర్ఎల్‌యూ) నుంచి గుడ్డిగురి ఆర్ఎల్‌యూకు, డీఆర్ ప్రసన్నను పి.బ్యాడిగెరె ఆర్ఎల్‌యూ నుంచి యు.బసవనపల్లి ఆర్ఎల్‌యూకు, హెచ్.భాగ్యలక్ష్మిని గుడ్డిగుర్కి ఆర్ఎల్‌యూ నుంచి కంచిసముద్రం ఆర్ఎల్‌యూకు, కె.వెంకటేశ్వర్లును కంచిసముద్రం ఆర్ఎల్‌యూ నుంచి పి.బ్యాడిగెరె ఆర్ఎల్‌యూకు బదిలీ చేశారు. హిందూపురంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బి.అంజలికుమార్‌ను ఉరవకొండ డీడీ ఆఫీసుకు బదిలీ చేశారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ విభాగంలో హెచ్.ఆనందమూర్తిని రాయదుర్గం నుంచి శెట్టూరు ఏవీహెచ్‌కు, సి.మల్లికార్జునను కణేకల్లు ఏవీహెచ్ నుంచి రాయదుర్గం ఏవీహెచ్‌కు, ఆర్ రేష్మాను కర్నూలు జిల్లా బేతంచెర్ల నుంచి యల్లనూరు ఏవీహెచ్‌కు, బి.శివప్రసాద్‌ను కర్నూలు జిల్లా పందికోన నుంచి కణేకల్లు ఏవీహెచ్‌కు బదిలీ చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనార్టీల అభ్యున్నతి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత, పైలా తదితరులు

- 'హమ్ సబ్ జగన్‌కే సాథ్'ను జయప్రదం చేయాలన్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: 'మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో సీఎం జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలు అన్ని విధాల ఎదిగేలా చర్యలు తీసుకున్నారు. సామాజిక భద్రత, రాజకీయ ప్రాధాన్యత కల్పించారు. గత టీడీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి రూ.2,665 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలోనే ఏకంగా రూ.11,896 కోట్లు కేటాయించింది. మైనార్టీలకు ప్రభుత్వం చేసిన మేలును చాటిచెప్పడానికి పార్టీ పిలుపునిచ్చిన హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా ప్రధాన పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

మైనార్టీలకు పెద్దపీట..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అనంత తెలిపారు. కార్పొరేటర్ నుంచి డిప్యూటీ సీఎం అవకాశం కల్పించారన్నారు. జిల్లా కేంద్రంలో మేయర్, మార్కెట్‌యార్డు చైర్మన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, గుత్తి మునిసిపల్ చైర్మన్, ఇలా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే వారి కోసం విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేశారన్నారు. 1814 హజ్ యాత్రికులకు రూ.14.51 కోట్లు రీయింబర్స్‌మెంట్ చేసిందన్నారు. ఇమామ్, మౌజెన్‌లకు గౌరవేతనం పెంచిందన్నారు. ప్రతిపక్ష టీడీపీ ముస్లింల వ్యతిరేక పార్టీ అయిన బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం రాష్ట్రం దివాళా తీస్తోందని విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సామాజిక న్యాయం చేసింది వైఎస్సార్‌సీపీనే..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ మైనార్టీలకు సామాజిక న్యాయం చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, వారి పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. మేయర్ వసీం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌తోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ మాట్లాడుతూ మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం చేసిన మేలును మైనార్టీలకు వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, చాందిని మసీదు ముతువల్లి రఫీ, నాయకులు మునీర, మన్సూర్, ఖాదర్, వేమల నదీం, జావె ద్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో పాటు ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడారు. ఉరవకొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారాన్ని తక్షణమే మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రిని కోరామన్నారు. దీనిపై మంత్రి సానుకులంగా స్పందించి త్వరలోనే పంట నష్టపరిహారాన్ని మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఆమిద్యాల–రాకెట్ల లిఫ్టుకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు రూ.8 కోట్ల పరిహారాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకులంగా స్పందించిందన్నారు. జీడిపల్లి ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా రూ.82 కోట్ల నిధులు విడుదల చేయుటకు ప్రభుత్వం త్వరలోనే పాలనా పరమైన ఆదేశాలు జారీ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉరవకొండ పట్టణంలో కోర్టు వివాదంలో ఉన్న 700 మంది ఇంటి పట్టాలకు సంబంధించి హైకోర్టు పీపీతో కూడా చర్చించామని , కోర్టులో క్లియరెన్స్ కాగానే లబ్ధిదారులకు స్థలాలు చూపుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యూలర్ చేశారన్నారు. ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు చర్యలు చేపట్టడంతో పాటు పెన్షన్ వచ్చేలా జీపీఎస్ విధానాన్ని అమలుకు చర్యలు తీసుకొని ఉద్యోగులకు అండగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, వణికేరి మల్లి పాల్గొన్నారు.

మేలైన దిగుబడులు సాధించండి

కణేకల్లు/ఆత్మకూరు: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి మేలైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. మోతాదుకు మించి ఎరువులు, మందులు కొట్టి డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. సాధ్యమైనంత మేరకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. కణేకల్లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామీణ వ్యవసాయ వాతావరణ సేవా పథకం కింద నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డీఏఓ హాజరై రైతులనుద్దేశించి మాట్లాడారు. మెట్టపొలాల్లో వేరుశనగతోపాటు చిరుధాన్యాలను సాగు చేయడం అలవాటు చేసుకోవాలని డీఏఓ పేర్కొన్నారు. వాతావరణంలో మార్పులు, భూమిలో వేడి పెరగడానికి గల కారణాలను ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవయసాయ విశ్వవిద్యాలయం పరిశోధస్థానం శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, అశోక్‌కుమార్ కూలంకశంగా వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కేవీఎస్ సుధీర్, టెక్నికల్ ఆఫీసర్ ఉమాదేవి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దు..

నకిలీ పత్తి విత్తనాలు కొని మోసపోవద్దని డీఏఓ ఉమామహేశ్వరమ్మ రైతులను హెచ్చరించారు. కణేకల్లు వ్యవయసాయశాఖ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. లైసెన్స్‌డీలర్ వద్దే పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు తీసుకునే బస్తాపై ఉన్న లాట్ నంబర్, బిల్లుపై ఎంట్రీ చేసే లాట్ నంబర్ ఒకటిగా ఉందో లేదో చెకప్ చేసుకొని తీసుకోవాలన్నారు.

జూలై 15 వరకు విత్తుకోవచ్చు..

ఖరీఫ్ సాగుకు సంబంధించి జూలై 15 వరకు విత్తుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు మండలం పంపనూరు రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన పంపిణీని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు.

గ్రామస్థాయిలో కమిటీలు

అనంతపురం సెంట్రల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిర్ణయించినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి, ఏఎన్ఎం, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, ఎడ్యుకేషన్ సెక్రటరీ, పంచాయతీ సెక్రటరీలతో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


అనంతపురం రూరల్: వేసవి సెలవుల అనంతరం పున: ప్రారంభం కానున్న వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి బీసీ వసతి గృహాల వార్డెన్లను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం, నార్పలలో వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం 12న హాస్టళ్లు పున: ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వసతి గృహాల్లో కొత్త మెనూ అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వార్డెన్లు తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండటంతో పాటు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎన్నిక మళ్లీ వాయిదా

అనంతపురం సిటీ: రాయదుర్గం రూరల్ మండల ఉపాధ్యక్షుడు–1 ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. కేంచానపల్లి ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందిన సత్యనారాయణను గతంలో ఉపాధ్యక్షుడు–1గా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆయన అకాల మరణంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఎన్నిక నిర్వహించారు. అయితే కోరం లేక వాయిదా పడింది.అయితే శుక్రవారం మరోసారి ఎన్నిక నిర్వహించగా.. సభ్యులెవరూ రాకపోవడంతో మళ్లీ వాయిదా వేసినట్లు జెడ్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎలుగుబంటి దాడి.. మహిళకు గాయాలు

- భల్లూకాన్ని బంధించిన గ్రామస్తులు
- అటవీశాఖ అధికారులకు అప్పగింత



గాయపడ్డ నల్లక్క, చిక్కిన ఎలుగు బంటి

ఆత్మకూరు: అటవీ ప్రాంతంలో ఉండాల్సిన ఓ ఎలుగుబంటి గ్రామంలోకి వచ్చేసింది. మనిషి కనబడితే వెంటబడుతూ అందరినీ ఆందోళనకు గురిచేసింది. చివరకు ఓ మహిళపై దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళితే...ఆత్మకూరు మండల పరిధిలోని బి.యాలేరు గ్రామానికి చెందిన నల్లక్క శుక్రవారం ఉదయం పొలానికి బయలుదేరింది. పొలం సమీపంలోకి చేరుకుంటుండగా, అక్కడే చెట్ల పొదల్లో మాటువేసిన ఎలుగుబంటి ఆమెపై దాడి చేసింది. దీంతో నల్లక్క పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కన ఉన్న వారు వెంటనే స్పందించారు. దీంతో ఎలుగుబంటి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో నల్లక్క కుడికన్నుకు గాయం కాగా, వెంటనే అనంతపురం సర్వజనాస్పత్రికి చికిత్స చేయించారు.

వలలు వేసి పట్టుకుని అధికారులకు అప్పగింత..

నల్లక్కపై ఎలుగు దాడి చేయడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. పెద్దపెద్ద వలలు తెప్పించి ఎలుగుబంటిని బంధించేందుకు పొలాలను గాలించారు. మధ్యాహ్నం వరకూ శ్రమించి ఎలుగుబంటిని బంధించారు. పోలీసు సిబ్బంది సమక్షంలో దాన్ని అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగన్‌దే

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ఏదైనా ఒక మాట చెప్పినా, హామీలు ఇచ్చినా వాటన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై కేబినెట్ ఆమోదం తెలపడంతో ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి, సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందించారు. 'థ్యాంక్యూ సీఎం సార్..' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగులభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. 12వ పీఆర్‌సీకి సంబంధించి ముందస్తుగానే కేబినెట్‌లో ఆమోదం తెలిపిందన్నారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగులభ్యున్నతికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు.


ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎన్‌జీఓ సంఘం నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు

22 ఏళ్ల కలను సాకారం చేశారు..

ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రమోహన్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారన్నారు. 22 ఏళ్ల కలను సాకారం చేసిన ఆయన మేలును మరువలేమన్నారు. క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో పోల్చిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చి 22ళ్ల బానిస బతుకు నుంచి విముక్తి కల్పించిన సీఎంకు రుణపడి ఉంటామన్నారు. ఎన్‌జీఓ సంఘం, కాంట్రాక్ట్ నాయకులు మధుబాబు, చెన్నారెడ్డి, మస్తాన్, వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి, జాన్సన్, హరికృష్ణ, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు సురక్షితం


మాట్లాడుతున్న వైద్యాధికారిణి శ్రావణి

రాప్తాడు: ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు సురక్షితమని వైద్యాధికారిణి శ్రావణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద హైరిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుట్టబోవు బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. బుధ, శనివారం ఇమ్యునైజేషన్ చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు అరుణమ్మ, లక్ష్మీ నరసమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దాస్ శనివారం తెలిపారు.

తపాలా శాఖలో ఆధార్ కేంద్రం మార్పు


హెడ్ పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ కౌంటర్

అనంతపురం సిటీ: అనంతపురం క్లాక్ టవర్ సమీపంలోని తపాలాశాఖ డివిజనల్ కార్యాలయం పైఅంతస్తులో ఉన్న ఆధార్ కేంద్రాన్ని మార్పు చేసినట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ హరిబాబు శుక్రవారం తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం కార్యాలయ మొదటి అంతస్తులో ఉన్న ఆధార్ కేంద్రాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి మార్పు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం సోమవారం నుంచి పూర్తి స్థాయంలో వినియోగంలోకి రానున్నట్లు తెలిపారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, నమోదు, అప్‌డేట్ వంటి వాటి కోసం ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. సోమవారం నుంచి రెండు పూటలా ఈ కేంద్రం పని చేస్తుందని స్పష్టం చేశారు.

పిల్లల భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలు పునాది


ప్రీస్కూల్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: పిల్లల భవిష్యత్‌కు అంగన్‌వాడీ స్కూల్స్ పునాది అని, ఆరేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విష్ణువర్ధిని, అంగన్‌వాడీ కార్యకర్త జమున తెలిపారు. నగరంలో రెండో సెక్టార్‌లో ప్రీస్కూల్‌లో చేర్పించాలని అవగాహన ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యాభ్యాసం ఆట బొమ్మల ద్వారా నేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ జమున, ఈశ్వరమ్మ, సంధ్య, సౌజన్య, సింధు, హెల్పర్లు పాల్గొన్నారు.

కంటింజెంట్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి


డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయితో మాట్లాడుతున్న ఎన్‌జీఓ సంఘం నాయకులు

అనంతపురం క్రైం: ఆరోగ్యశాఖలోని కంటింజెంట్ ఉద్యోగులకు జీఓ 549 ప్రకారం రూ.16వేలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయిని ఎన్‌జీఓ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. 25 ఏళ్లుగా ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీఓకు అనుగుణంగా వేతనాలు అందించాలని విజ్ఞప్తి చేయగా, అందుకు డీఎంహెచ్‌ఓ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ చంద్రశేఖర్ రెడ్డి, డీ చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు జమీలాబేగం, ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్ప, నాయకులు గౌస్‌పీరా, నాగభూషణం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను సాగుకు సమాయత్తం చేద్దాం

- అగ్రిబోర్డు మీటింగ్‌లో ఏఓ శశికళ


మాట్లాడుతున్న ఏవో శశికళ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రారంభం కావడం, వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులను సాగుకు సమాయత్తం చేయాల్సిన అవసరం ఉందని ఏఓ శశికళ తెలిపారు. శుక్రవారం స్థానిక కృషిభవన్‌లో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి (అగ్రి అడ్వైజరీ బోర్డు) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శశికళ, హెచ్‌వో ధనుంజయ, బోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఆర్‌బీకే వేదికగా 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులు, కొర్రలు, రాగులు, 30 శాతం సబ్సిడీతో కందులు, పెసలు పంపిణీ చేస్తోందన్నారు. రాయితీ విత్తనాలు రైతులు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. అవసరమైన ఎరువులు ఆర్‌బీకేలతో పాటు ప్రైవేట్ డీలర్ల దగ్గర ఉన్నట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల జూలై ఆఖరు వరకు పంటల సాగుకు అనువైన సమయం కావడం వల్ల ఎకరా కూడా బీడు భూములు లేకుండా రైతులను ప్రోత్సహించాలనే అంశంపై చర్చించారు. సమావేశంలో ఏఈఓలు ప్రసాద్, మురళి, అలేఖ్య, అగ్రిబోర్డు సభ్యులు, రైతులు, ఆర్‌బీకే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం


రాప్తాడులో రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న ఏఓ వెంకటేశ్వర ప్రసాద్

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏఓ వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం రాప్తాడులో రైతు భరోసా కేంద్రంలో రెండో విడతలో ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 3,200 క్వింటాళ్లు అవసరమని, రైతులు వేరుశనగ విత్తన కాయలు కావాలని అడిగితే 10 వేల క్వింటాళ్లు తెప్పించడానికి సిద్ధంగా ఉన్నామ న్నారు. మండల అగ్రి బోర్డు చైర్మన్ కేశవరెడ్డి, వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ సోనియా పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచామని ఏఓ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద యంత్ర సామగ్రి, పురుగు, డ్రిప్పు మందులు కూడా అందుబాటులో ఉంచామన్నారు. డ్రిప్పు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ సకాలంలో డ్రిప్ మంజూరు చేస్తామన్నారు. పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటే రైతులకు పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ కేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రిలో వార్డుల తనిఖీ

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని వివిధ వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెస్ట్ వార్డులో రూఫింగ్ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గైనిక్ వార్డును పరిశీలించిన ఆయన గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు పాల్గొన్నారు.

సెలవులో సూపరింటెండెంట్...

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మరోసారి సెలవులో వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సెలవులో వెళ్లారు. తిరిగి వచ్చే వరకు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ బాధ్యతలను మానసిక వైద్య విభాగాధిపతి వైద్యనాథ్‌కు అప్పగించారు.

శరవణ స్లగ్గర్స్ గెలుపు

అనంతపురం: అనంతపురం క్రికెట్ లీగ్ –2023లో భాగంగా శుక్రవారం జరిగిన అనంత రైజింగ్ స్టార్, శరవణ స్లగ్గర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో శరవణ స్లగ్గర్స్ గెలుపొందింది. క్రికెట్ మ్యాచ్‌ను డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహారెడ్డి ప్రారంభించారు. తొలుత బ్యాటింగ్ చేసిన శరవణ స్లగ్గర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్ 16.3 ఓవర్లలో 84 పరుగులకే ఆలౌట్ అయింది.

కోగటం వారియర్స్ విజయం..

కోగటం వారియర్స్, స్పర్టాన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నాలుగు పరుగుల తేడాతో కోగటం వారియర్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోగటం వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కేహెచ్ వీరారెడ్డి 50 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన స్పర్టాన్స్ 156 పరుగులు మాత్రమే చేసింది.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

రాప్తాడురూరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం అనంతపురంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. సంఘం 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందని ఎస్టీయూ నాయకులు అన్నారు. సంఘం సాధించిన విజయాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి. సూర్యుడు, పధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్స్ ఫణిభూషణ్, సూర్యనారాయణ గౌడ్, రవి, మురళీకృష్ణ, రాజశేఖర్, బాబ్జి నాయక్, కృష్ణప్ప, ఇమాం సాహెబ్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ జనార్దన్ తెలిపారు. శుక్రవారం మండలంలో పలు చోట్ల ప్రజలకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రయాణాలు చేసేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఏఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర సమీపంలోని అనంత సాగరం కాలనీ వద్ద పేకాట ఆడుతుండగా ఏడుగురిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8,150 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాణీనగర్‌లో నలుగురు మట్కా బీటర్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.28వేలుల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లయితే సమాచారం ఇవ్వాలని సీఐ రెడ్డప్ప తెలిపారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. డయల్ 100కు ఫోన్ చేసి, వివరాలు చెప్పాలన్నారు.

నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశించారు. 38వ డివిజన్‌లోని కోవూర్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు పనులను మేయర్ ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను పనులు చేపట్టాలని, పనులు జరిగే సమయంలో ఏఈలు అందుబాటులో ఉండాలన్నారు. నగరాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.97.34 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు రూ.25 కోట్ల సీఎం స్పెషల్ గ్రాంట్ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అన్ని డివిజన్లలో అంతర్గత రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, డీఈ రాంప్రసాద్ రెడ్డి, డివిజన్ నాయకులు ఖాజా, చింతకుంట మధు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్ర స్థాయి సమ్మేళనం


సమ్మేళనం పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: గుంటూరు జిల్లాలో రాష్ట్ర స్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమ్మేళనం పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమన్నారు. యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలు, దేశభక్తి, ప్రజాస్వామిక ఆలోచనలు, నైతిక విలువలు, మానవత్వాన్ని మేలుకొల్పడమే లక్ష్యంగా ఏఐవైఎఫ్ కృషి చేస్తోందన్నారు. అందరికీ నైపుణ్యం కలిగిన విద్య, మెరుగైన వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు నిస్వార్థంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, నాయకులు మోహన్‌కృష్ణ, రాకెట్ల రాము, శ్రీకాంత్, లిఖిల్‌యాదవ్, నవీన్‌చౌదరి, సాయి పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని హౌసింగ్ బోర్డు ఎల్ఐజీ కాలనీలో గౌడ్ జనరల్ స్టోర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఈఘటనపై శుక్రవారం మధ్యాహ్నం స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటి దాకా పదుల సంఖ్యలో స్నాచింగ్‌లు జరిగాయి. ఒక్క స్నాచర్‌ను పోలీసులు గుర్తించలేక పోయారు. తాజాగా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు క్రైం టీమ్‌లను ఏర్పాటు చేసి గస్తీలను పెంచారు. అయినా స్నాచింగ్‌లు ఆగలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలని...

సులభంగా డబ్బు సంపాదించాలని నగరంలోని మల్లేశ్వరరోడ్డుకు చెందిన రవితేజ అనే యువకుడు ఇళ్లకు కన్నాలు వేసి, చోరీలకు పాల్పడుతున్నాడు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రెడ్డప్ప వివరాలు వెల్లడించారు. రవితేజ తాగుడుతో పాటు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. డబ్బు సంపాదించేందుకు చోరీలు చేస్తున్నాడు. నగరంలోని మహల్దార్ కాలనీలో ఓ ఇంట్లో కన్నం వేసేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటిదాకా వన్‌టౌన్ పరిధిలో రెండు, మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒక చోరీ చేసినట్లు పోలీసు విచారణలో అంగీకరించాడు. దీంతో అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 27 గ్రాముల బంగారు, 5 తులాల వెండి, రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రైతులకు కేంద్రం ద్రోహం

అనంతపురం అర్బన్: రైతులు పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చుల కంటే తక్కువగా మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించి రైతులకు ద్రోహం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ విమర్శించింది. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మద్దతు ధరల నిర్ణయంలో నీటిపారుదల ఖర్చులు, ఎరువుల ధరలు, తదితరాల పెరుగుదలను పరిగణలోకి తీసుకోకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. వరి క్వింటాల్‌కు సి2+50 శాతం ఫార్ములా ప్రకారం 2,707 ప్రకటించాల్సి ఉండగా, ప్రభుత్వం మద్దతు ధరను 2,183 ప్రకటించిందన్నారు. దీంతో రైతులకు రూ.524 నష్టమన్నారు. వేరుశనగకు మద్దతు ధర క్వింటాకు రూ.7,411 కాకుండా రూ.6,377 ప్రకటించడంతో రైతులకు రూ.1,100 నష్టమన్నారు. మొక్కజొన్నకు రూ.2,569 ప్రకటించాల్సి ఉండగా, రూ.6,620 ప్రకటించడంతో క్వింటాలు మీద రైతులకు రూ.1,475 నష్టమన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు వర్తించాలి


ఆత్మకూరులో అగ్రి అడ్వైజరీ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవి

ఆత్మకూరు: ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఎంపీపీ సుబ్బర హేమలత కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఏడీఏ రవి ఆధ్వర్యంలో అగ్రి అడ్వైజరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు ,విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుతున్నాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనూ రిజిస్ట్రేషన్లు చేసుకొని పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, సర్పంచ్ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హనుమంతు నాయక్, వీఎస్ఏ భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణరెడ్డి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అనంతపురం రూరల్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకెళ్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె రఘునాథ్‌రెడ్డి, రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, విశ్రాంత డీజీపీ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలమూరు సమీపంలోని శ్రీ కృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె రఘునాథ్‌రెడ్డి, విశ్రాంత డీజీపీ శంకర్‌రెడ్డి హాజరయ్యారు. మాట్లాడుతూ విద్యార్థులు రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీవీకేకే కళాశాలల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన బ్రహ్మయ్య అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ అశోక్‌కుమార్‌రెడ్డి అక్కడికెళ్లి శుక్రవారం పింఛన్ అందించాడు. పింఛన్ అందించి, వైఎస్సార్ బీమాను రెన్యూవల్ చేయించాడు.

టీపీఓ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఓగా శిరీష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇటీవల యర్రగుంట్ల నుంచి అనంతపురం నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చారు. అంతకుముందు ఆమె కమిషనర్ రమణారెడ్డి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

మండే ఎండ..గొడుగే అండ



ఎండలు మండిపోతున్నాయి. రోడ్లపైకి రావాలంటేనే జనం భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసుల విధులు కత్తిమీద సాములా మారాయి. మండే ఎండల్లోనే తగిన జాగ్రత్తలతో విధులు నిర్వర్తిస్తున్నారు. అనంతపురం టవర్‌క్లాక్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ గొడుగు రక్షణలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్న దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి

అనంతపురం క్రైం: పారిశుధ్యం మెరుగునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ రమణారెడ్డి నగర ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని హమాలీకాలనీ, హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్, రాంనగర్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. క్లాప్ ఆటో నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రజలకు సూచనలు అందించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, శ్రీ కృష్ణదేవరాయ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనుల పురోగతిపై కమిషనర్ ఆరా తీశారు. నాణ్యతలో రాజీపడొద్దన్నారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట ఈఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి, స్కూల్ హెచ్ఎం శ్యాం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి వైఎస్ జగన్

రాప్తాడురూరల్: రైతుల పక్షపాతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సర్పంచ్ అంజియాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, , వై.రామకృష్ణారెడ్డి, జి.శ్యాంసుందర్‌రెడ్డి, పి.రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం రాచానపల్లి ఆర్‌బీకే పరిధిలోని రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. 82 మంది రైతులకు ఒక్కొక్కరికి మూడు బ్యాగుల చొప్పున విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. సర్పంచ్, నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం అందజేసే విత్తన వేరుశనగ కోసం రైతులు చిన్నపాటి యుద్ధమే చేసేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పంటలకు అవసరమైన మందులు కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు కష్టాలుతొలిగాయన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ కె.శివశంకర్ పాల్గొన్నారు.

రేపు శ్రీవారికి తిరుప్పావడ సేవ



అనంతపురం కల్చరల్: జిల్లాలో తొలిసారి శ్రీగోవింద వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 'శ్రీవారికి తిరుప్పా వడ సేవ' నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి శ్రీవారి ఉత్సవమూర్తి అందంగా ముస్తాబవుతున్నాడు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరగనున్న కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గౌతమి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య ప్రారంభించనున్నారు.

శ్రీనివాసుడికి ఘనమైన నేవేద్యం : శ్రీవారికి తిరుప్పావడ సేవలో భాగంగా శ్రీనివాసుడికి ఘనమైన నైవేద్యం సమర్పిస్తున్నారు. 1000 ఓళిగలు, మరో 1000 లడ్డూలతో పాటు 151 కేజీల పులిహోరతో స్వామివారిని అలంకరించి, పూజలనంతరం భక్తులకు ప్రసాదంగా వితరణ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు ఓంకారంతో ప్రారంభమై శ్రీవారి ఆవాహన, షోడపోపచారపూజలు, అష్టోత్తర శతనామావళి, శ్రీనివాస గద్యం, గోవింద భజనలు, మహా మంగళ హారతితో ముగిసి మహా ప్రసాద వితరణ చేస్తామని శ్రీవాసవి గోవింద సేవా సంఘం అధ్యక్షుడు ఆళ్లగడ్డ రాము తెలిపారు.